# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఉదయం 11 గంటలకు పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.**

**2. రాష్ట్ర అభివృద్ధి కోసం రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్-2047లో ఆర్యవైశ్యులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.**

**3. రాష్ట్ర బడ్జెట్‌లో 21వేల కోట్ల రూపాయలు విద్యాశాఖ కోసం కేటాయించామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు.**

**4. సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెట్టడం వ్యవస్థీకృత నేరంగా మారిందని.. అలాంటి వాటిపై ఉక్కుపాదం మోపుతామని ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీశ్‌కుమార్ గుప్తా స్పష్టం చేశారు.**

**5. రథసప్తమి సందర్భంగా తిరుమలలో శ్రీవారి దర్శనానికి విస్తృత ఏర్పాట్లు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు.**

=========================

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు ఉదయం 11 గంటలకు పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం వరుసగా ఇది 8వ సారి. మరోవైపు.. భారత ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక సర్వే ఉద్ఘాటించింది. అన్ని రంగాల్లో దేశం పురోగతి సాధిస్తోందని తెలిపింది. అదే సమయంలో సుస్థిరాభివృద్ధిని కొనసాగించేందుకు నిర్మాణాత్మక సంస్కరణలు తేవాల్సిన ఆవశ్యకత ఉందని వెల్లడించింది. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నిన్న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పలు కీలక అంశాలను ఈ సర్వే ప్రస్తావించింది. రానున్న ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థిక వృద్ధి రేటు 6.3 నుంచి 6.8 శాతం మధ్య ఉంటుందని చెప్పిన సర్వే... ద్రవ్యోల్బణమూ అదుపులోనే ఉంటుందని తెలిపింది.

-------------------------

జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమంతో ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక పారిశ్రామిక నగరం ఏర్పడుతుందని, అది ప్రధాన ఉత్పాదక పెట్టుబడుల కేంద్రంగా మారుతుందని కేంద్ర ఆర్థిక సర్వే తెలిపింది. గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో 4 పారిశ్రామిక నగరాలు ఏర్పడ్డాయని, ఆంధ్రప్రదేశ్‌లోని

కృష్ణపట్నంలో ఆ దిశగా ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించింది. సొంత పన్ను వసూళ్లు, రెవెన్యూ వసూళ్లు 50 శాతం పైగా అధికంగా ఉన్న 15 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటని.. అయితే సొంత రెవెన్యూ రాబడిలో అత్యధిక వాటా జీఎస్టీదేనని పేర్కొంది. పది రాష్ట్రాల్లో నెలకొల్పిన సమీకృత అభివృద్ధి లక్ష్యాల సమన్వయ కేంద్రాలు.. ఎస్‌డీజీసీసీలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని కేంద్ర ఆర్థిక సర్వే తెలిపింది.

---------------------------

పన్నుల వసూలులో తెలంగాణ దేశంలోనే మొదటిస్థానంలో ఉందని 'ఆర్థిక సర్వే' వెల్లడించింది. 88 శాతం వసూలుతో తెలంగాణ అగ్రస్థానంలో నిలవగా.. కర్ణాటక, హరియాణా తర్వాతి స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక విధానం ఈ-కామర్స్ వాణిజ్యాన్ని ప్రోత్సహించేలా ఉందని తెలిపింది. తెలంగాణలో 86 శాతం పంట పొలాలకు ప్రభుత్వం సాగునీటిని అందిస్తోందని.. జలజీవన్ మిషన్ కింద పైపులైన్ల ద్వారా వంద శాతం సురక్షిత నీటిని అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని ఆర్థిక సర్వే వెల్లడించింది.

---------------------------

రాష్ట్ర అభివృద్ధి కోసం రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్-2047లో ఆర్యవైశ్యులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో నగరేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని నిన్న ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళల ఆత్మగౌరవాన్ని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు చాటారని తెలిపారు. శాంతి కోసం వాసవీ మాత ఆత్మ బలిదానం చేశారని చెప్పారు. వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఆర్యవైశ్యులను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటైందని చంద్రబాబునాయుడు తెలియజేస్తూ..

..వాయిస్.. 27 సెకన్లు

---------------------------

రాష్ట్ర బడ్జెట్‌లో 21వేల కోట్ల రూపాయలు విద్యాశాఖ కోసం కేటాయించామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిన్న జరిగిన 150వ వార్షికోత్సవానికి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొగిలిగిద్దకు సుమారు 16 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామని చెప్పారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. తమ ప్రభుత్వంలో 11వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని, 21వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

---------------------------

ప్రజలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో పునర్‌నిర్మించనున్న ఉస్మానియా ఆసుపత్రి భవనానికి తెలంగాణ ముఖమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇతర మంత్రులు నిన్న జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుతం ఆసుపత్రి అఫ్జల్‌గంజ్‌లో ఉండగా.. నూతన భవనాన్ని గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్నారు.

---------------------------

రథసప్తమి సందర్భంగా తిరుమలలో శ్రీవారి దర్శనానికి విస్తృత ఏర్పాట్లు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో నిన్న ధర్మకర్తల మండలి సమావేశం ముగిసిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రథసప్తమి రోజు పలు ఆర్జిత సేవలను ఏకాంతంగా నిర్వహించేందుకు నిర్ణయించామని చెప్పారు. సిఫారసు లేఖల దర్శనాలు, తిరుపతిలో జారీ చేసే సర్వదర్శనం టోకెన్లనూ రద్దు చేస్తున్నామని వెల్లడించారు. తిరుమలకు నేరుగా వచ్చే భక్తులను వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌ల ద్వారా శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని టీటీడీ ఛైర్మన్ తెలియజేస్తూ..

... వాయిస్.. 33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి ఎన్నికల కోడ్ ముగియగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే టీచర్ల భర్తీ ప్రక్రియ చేపడతామని చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘాలతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ ఉపాధ్యాయుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు.

---------------------------

సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెట్టడం వ్యవస్థీకృత నేరంగా మారిందని.. అలాంటి వాటిపై ఉక్కుపాదం మోపుతామని ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీశ్‌కుమార్ గుప్తా స్పష్టం చేశారు. డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యం నెరవేర్చడంలో పోలీసు శాఖ తన వంతు బాధ్యత నిర్వహిస్తుందన్నారు. గత ఏడు నెలల్లో పోలీసు శాఖలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని డీజీపీ తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు.. వాటి వినియోగంపై దృష్టి పెడతామని వెల్లడిస్తూ..

.. వాయిస్..26 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు నుంచి భూముల విలువ సవరణ అమల్లోకి వస్తోంది. ప్రాంతాల వారీగా భూమి విలువ ఈ ఉదయం 10 గంటల నుంచి రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని ఆ శాఖ ఉన్నతాధికారులు నిన్న రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో 'చలి ఉత్సవ్-2025' లో తొలిరోజు గిరిజన సంప్రదాయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం 5కే రన్, స్థానిక గిరిజన మ్యూజియం ఆవరణలో ముగ్గులు, పెయింటింగ్ పోటీలు, సాయంత్రం కార్నివాల్ నిర్వహించారు. సాయంత్రం ఆరు నుంచి రాత్రి 10 గంటల వరకూ వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. అరకులోయ డిగ్రీ కళాశాల మైదానంలోని ఉత్సవ్ ప్రధాన వేదిక వద్ద ఆదివాసీలు, ఇతరుల చేతివృత్తుల ఉత్పత్తులతో 25 స్టాళ్లను ఏర్పాటుచేశారు. ఈ చలి ఉత్సవ్‌లో హెలికాప్టర్ రైడ్ మొత్తం కార్యక్రమానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

=====================